దేశ సమైక్యత, సమగ్రతల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

– జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్




కామారెడ్డి, అక్టోబర్ 31 (తెహెల్కా న్యూస్)

దేశ సమైక్యత, సమగ్రతల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు.

తెహెల్కా
ప్రతి వార్త సంచలనం





నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం 1 నవంబర్ 2026 పేజీలు : 4

మిర్చి, క్యాప్సికం సాగుతో అధిక లాభాలు

▶ రైతుకు కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రశంసలు.

▶ కూరగాయల సాగుతో తక్కువ పెట్టుబడికి అధిక ఆదాయం పొందవచ్చని తెలిపిన రైతు.



కామారెడ్డి, అక్టోబర్ 31 (తెహెల్కా న్యూస్)

కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ రైతు కోమిరెడ్డి అంజయ్య సాగు చేస్తున్న మిర్చి, క్యాప్సికం తోటలను శనివారం సందర్శించారు. పంటల సాగు విధానం, దిగుబడి, మార్కెటింగ్, రైతుకు వస్తున్న ఆదాయం తదితర వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు కోమిరెడ్డి అంజయ్య మాట్లాడుతూ, తాను గత మూడు సంవత్సరాలుగా క్యాప్సికం పంటను సాగు చేస్తున్నానని తెలిపారు. ఒక ఎకరా విస్తీర్ణంలో క్యాప్సికం సాగు చేసి సుమారు 30 టన్నుల దిగుబడిని సాధించినట్లు వెల్లడించారు. పండించిన పంటను టన్నుకు రూ.40,000 చొప్పున విక్రయించగా, మొత్తం రూ.12 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. సాగు ఖర్చులు, ఇతర వ్యయాలు పోను సుమారు రూ.10 లక్షల వరకు నికర ఆదాయం పొందినట్లు సంతోషం వ్యక్తం చేశారు. – మిగతా2లో

పోలీస్ విధానాల పై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన



– పోలీస్ స్టేషన్లలో ఓపెన్‌హౌస్ కార్యక్రమాలు, అమరవీరుల త్యాగాల సంస్మరణ.

– సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర సూచన

కామారెడ్డి, అక్టోబరు 31 (తెహెల్కా న్యూస్)

పోలీస్ శాఖ విధులు, బాధ్యతలు, నేరాల దర్యాప్తులో వినియోగించే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కల్పించేందుకు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో శనివారం ఓపెన్‌హౌస్ కార్యక్రమాలు నిర్వహించారు. పోలీస్ ఫ్లాగ్ డే--2026, పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలు చేపట్టారు. – మిగతా2లో

మిర్చి, క్యాప్సికం సాగుతో అధిక లాభాలు

కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ రైతు కోమిరెడ్డి అంజయ్య సాగు చేస్తున్న మిర్చి, క్యాప్సికం తోటలను శనివారం సందర్శించారు. పంటల సాగు విధానం, దిగుబడి, మార్కెటింగ్, రైతుకు వస్తున్న ఆదాయం తదితర వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు కోమిరెడ్డి అంజయ్య మాట్లాడుతూ, తాను గత మూడు సంవత్సరాలుగా క్యాప్సికం పంటను సాగు చేస్తున్నానని తెలిపారు. ఒక ఎకరా విస్తీర్ణంలో క్యాప్సికం సాగు చేసి సుమారు 30 టన్నుల దిగుబడిని సాధించినట్లు వెల్లడించారు. పండించిన పంటను టన్నుకు రూ. 40,000 చొప్పున విక్రయించగా, మొత్తం రూ. 12 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. సాగు ఖర్చులు, ఇతర వ్యయాలు పోను సుమారు రూ. 10 లక్షల వరకు నికర ఆదాయం పొందినట్లు సంతోషం వ్యక్తం చేశారు.

కూరగాయల సాగు ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశం ఉంది: రైతు

సంప్రదాయ వరి సాగుతో పోలిస్తే కూరగాయల సాగు ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని, ముఖ్యంగా క్యాప్సికం వంటి ఉద్యాన పంటలను శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయడం వల్ల మంచి దిగుబడితో పాటు మెరుగైన లాభాలు పొందవచ్చని రైతు తన అనుభవాన్ని వివరించారు. గత మూడు సంవత్సరాలుగా క్యాప్సికం సాగు ద్వారా మంచి ఫలితాలు సాధిస్తున్నానని, ఇతర రైతులు కూడా పంటల మార్పిడి విధానాన్ని అనుసరిస్తూ కూరగాయల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం రైతుతో మాట్లాడిన కలెక్టర్ ఉద్యాన పంటల సాగులో అనుసరిస్తున్న పద్ధతులు, పంటల యాజమాన్యం, దిగుబడి వివరాలను తెలుసుకున్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చుకోవచ్చు: కలెక్టర్

సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకొని, ఆధునిక సాగు పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం సాధించాలని రైతులకు సూచించారు. రైతులు తమకున్న భూమి, నీటి వనరులు, మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించుకోవాలని, వ్యవసాయ మరియు ఉద్యాన శాఖల అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ ముందుకు సాగాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్ వై గిరి, జిల్లా ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ శాఖ అధికారి జ్యోతి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి సుమన్, ఉద్యాన విస్తరణ అధికారి బాపురెడ్డి, ఇతర మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ విధానాల పై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన

పోలీస్ శాఖ విధులు, బాధ్యతలు, నేరాల దర్యాప్తులో వినియోగించే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కల్పించేందుకు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో శనివారం ఓపెన్‌హౌస్ కార్యక్రమాలు నిర్వహించారు. పోలీస్ ఫ్లాగ్ డే-2026, పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలు చేపట్టారు.

ఆయుధాలు, క్లూస్ టీమ్, ఫింగర్ ప్రింట్ పరికరాల ప్రదర్శన

పోలీస్ స్టేషన్లను సందర్శించిన విద్యార్థులకు అక్కడి వివిధ విభాగాల పనితీరు, పోలీసుల విధులు, ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియలను అధికారులు వివరించారు. నేరాలు జరిగినప్పుడు సంఘటనా స్థలంలో ఆధారాలు ఎలా సేకరిస్తారు? నిందితులను గుర్తించేందుకు ఎలాంటి పద్ధతులు అనుసరిస్తారు? అనే అంశాలను తెలియజేశారు. క్లూస్ టీమ్ పనితీరు, వేలిముద్రల సేకరణ, ఫింగర్‌ప్రింట్ పరికరాల వినియోగం, సాంకేతిక ఆధారాలతో నేరాలను ఛేదించే విధానాలను ప్రత్యక్షంగా ప్రదర్శించారు. పోలీస్ శాఖలో ఉపయోగించే ఆయుధాలు, భద్రతా పరికరాలు, ఇతర సామగ్రిని చూపించి వాటి వినియోగం గురించి వివరించారు.

మహిళలు, బాలికలు, చిన్నారుల రక్షణకు షీ టీమ్స్

మహిళలు, బాలికలు, చిన్నారుల రక్షణకు అందుబాటులో ఉన్న షీ టీమ్స్, భరోసా కేంద్రాల సేవలతోపాటు అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 ద్వారా పోలీసుల సహాయం పొందే విధానాన్ని తెలియజేశారు. సీసీ కెమెరాల ప్రాధాన్యం, పెట్రోలింగ్ వ్యవస్థ, అనుమానాస్పద వ్యక్తులను గుర్తించే ప్రక్రియపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, అనుమానాస్పద సందేశాలను నమ్మవద్దని, వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీని ఎవరితోనూ పంచుకోవద్దని తెలిపారు.



పోలీసుల త్యాగాలు ప్రతి ఒక్కరు స్మరించుకోవాలి

ఈ సందర్భంగా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ., ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కల్పించడం, శాంతిభద్రతలను పరిరక్షించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తూ ప్రజల భద్రతకు కృషి చేస్తున్నారని తెలిపారు. సమాజ రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, ప్రతి ఒక్కరూ వారిని స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

విద్యార్థులు చిన్నతనం నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. చట్టాన్ని గౌరవించే ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, నేరాల నియంత్రణలో ప్రజల సహకారం కీలకమని స్పష్టం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు పోలీస్ శాఖపై విద్యార్థులకు అవగాహన పెంచడంతోపాటు చట్టాల పట్ల గౌరవం, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమాల్లో సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ సమైక్యత, సమగ్రతల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

దేశ సమైక్యత, సమగ్రతల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశాన్ని ఐకమత్యంగా ఉంచడంలో కృషిచేసిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యత దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని, దేశానికి దిశ, నిర్దేశం చేసిన ఆయన చిరస్మరణీయుడని అన్నారు. అనంతరం దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడటానికి స్వయంగా అంకితమవుతానని, దేశ అంతర్గత భద్రతను పటిష్ట పరచడానికి స్వీయ తోడ్పాటు నందిస్తానని అధికారులు, ఉద్యోగులచే రాష్ట్రీయ ఏక్తా దినోత్సవ ప్రతిజ్ఞను కలెక్టర్ చేయించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్ వై గిరి, డిఆర్ఓ పాండు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.
- ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్ష





కామారెడ్డి, అక్టోబర్ 31 (తెహెల్కా న్యూస్)

ధాన్యం కొనుగోళ్లను పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శనివారం ఖరీఫ్ 2026-27 ధాన్యం కొనుగోళ్ల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం శుభ్రపరిచే యంత్రాలు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, కొనుగోలు కేంద్రాలకు గోదాములు మరియు రైస్ మిల్లుల ట్యాగింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ధాన్యాన్ని కనీస మద్దతు ధర కంటే తక్కువకు విక్రయించే పరిస్థితి రాకుండా చూడాలని సూచించారు.

సోయాబీన్ దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

- నిందితుడి అరెస్ట్, రిమాండుకి తరలింపు.
- నిందితుడి వద్దనుండి 93 కిలోల సోయాబీన్, బైక్ స్వాధీనం.
- కాస్లాబాద్ రైతు ఇంటి ఆవరణలో సోయాబీన్ చోరీ.
- పోలీసు సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ



కామారెడ్డి, అక్టోబరు 31(తెహెల్కా న్యూస్)

కామారెడ్డి జిల్లా పెద్దకొడపగల్ మండలం కాస్లాబాద్ గ్రామంలో జరిగిన సోయాబీన్ దొంగతనం కేసును పెద్దకొడపగల్ పోలీసులు ఛేదించారు. ఈ ఘటనకు పాల్పడిన అదే గ్రామానికి చెందిన సొంటికె నారాయణ (43)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి నుంచి దొంగిలించిన 93 కిలోల సోయాబీన్‌తో పాటు మరో ప్రాంతంలో చోరీ చేసిన హోండా షైన్ మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాస్లాబాద్‌కు చెందిన రైతు చౌదరి అనంతరావు ఈ నెల 29న తన ఇంటి ఆవరణలో నిల్వ ఉంచిన రెండు సంచుల సోయాబీన్ (సుమారు రూ.6 వేల విలువ) చోరీకి గురైనట్లు పెద్దకొడపగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు గ్రామంలో సమాచారం సేకరించడంతో పాటు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో శనివారం బేగంపూర్ గేట్ సమీపంలోని జాతీయ రహదారి 161పై వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న నారాయణను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో సోయాబీన్ చోరీతో పాటు మరో దొంగతనం వెలుగులోకి వచ్చింది. సుమారు ఏడు నెలల క్రితం జుక్కల్ మండలం ఖండేబల్లూర్‌లోని ఓ మెకానిక్ దుకాణం ఎదుట పార్క్ చేసిన హోండా షైన్ బైక్‌ను అతడు చోరీ చేసినట్లు విచారణలో వెల్లడైంది. రిజిస్ట్రేషన్ నంబరు ప్లేట్లు తొలగించి దానిని వినియోగిస్తున్నాడు. కాస్లాబాద్‌లో చోరీ చేసిన సోయాబీన్‌ను పిట్లం ప్రాంతంలో విక్రయించేందుకు తీసుకెళ్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి రెండు సంచుల్లోని 93 కిలోల సోయాబీన్, నల్లరంగు హోండా షైన్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన ఎస్ఐ జి.అరుణ్‌కుమార్, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర అభినందించారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యం

- విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలి.
- ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవాలి.
- నూతన ఆవిష్కరణలు మరియు పరిశోధనల వైపు అడుగులు వేయాలి.
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.
- గ్రామీణ విద్యార్థులను అంతరిక్ష పరిశోధనల వైపు నడిపించే దిశగా కలెక్టర్ ముందడుగు.



కామారెడ్డి, అక్టోబర్ 31 (తెహెల్కా న్యూస్)

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యమని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక రంగాల పట్ల ఆసక్తిని పెంపొందించి, వారిని పరిశోధన రంగం వైపు ప్రోత్సహించాలనే లక్ష్యంతో కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఇస్రో (ఇస్రో) సందర్శించే అవకాశాన్ని కల్పించేందుకు ప్రత్యేక పోటీ పరీక్షను శనివారం నిర్వహించారు. గత సంవత్సరం నిర్వహించిన ఇస్రో క్విజ్ పోటీల్లో సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొనగా, ప్రతిభ ఆధారంగా ఎంపికైన 50 మంది విద్యార్థులతో పాటు 30 మంది ఉపాధ్యాయులకు ఇస్రో సందర్శించే అవకాశం కల్పించారు. ఈ సందర్శన ద్వారా విద్యార్థులు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సాధించిన విజయాలు, అంతరిక్ష విజ్ఞానం, శాస్త్ర సాంకేతిక అభివృద్ధి గురించి ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం పొందారు. గత సంవత్సరం వచ్చిన మంచి స్పందనను దృష్టిలో ఉంచుకొని ఈ సంవత్సరం మరింత ఎక్కువ మంది విద్యార్థులకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఇస్రో క్విజ్ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 772 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో కామారెడ్డి డివిజన్ నుంచి 552 మంది, బాన్సువాడ డివిజన్ నుంచి 220 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్ష ద్వారా ప్రతిభ కనబరిచిన 50 మంది విద్యార్థులను, 30 మంది ఉపాధ్యాయులను ఇస్రో విద్యా సందర్శనకు ఎంపిక చేయనున్నారు. ఇకపై ప్రతి సంవత్సరం రెండుసార్లు ఇలాంటి ప్రత్యేక పరీక్షలు నిర్వహించి, మరింత ఎక్కువ మంది విద్యార్థులకు ఇస్రో వంటి ప్రతిష్ఠాత్మక పరిశోధనా సంస్థలను సందర్శించే అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ., విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవాలని, నూతన ఆవిష్కరణలు మరియు పరిశోధనల వైపు అడుగులు వేయాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇలాంటి అవకాశాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెరగడంతో పాటు భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా, పరిశోధకులుగా ఎదిగేందుకు ప్రేరణ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీయడం, వారికి ఉన్నత విద్యా అవకాశాలపై అవగాహన కల్పించడం, అంతరిక్ష పరిశోధనల పట్ల ఆసక్తిని పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గిరి, జిల్లా విద్యాశాఖ అధికారి సి. మల్లికార్జున్, జిల్లా సైన్స్ అధికారి సిద్ధరాంరెడ్డి, వివిధ పాఠశాలల భౌతిక, రసాయన, జీవశాస్త్ర ఉపాధ్యాయులు, వివిధ మండలాల నుంచి హాజరైన ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ విద్యార్థుల కలలకు రెక్కలు తొడిగి, వారిని అంతరిక్ష పరిశోధనల వైపు నడిపించే దిశగా కామారెడ్డి జిల్లా కలెక్టర్ చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం విద్యారంగంలో అభినందనీయమైన ముందడుగుగా నిలుస్తోంది.

కామారెడ్డి జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు

- జిల్లాలో 30, 30(ఎ) పోలీస్ యాక్ట్.
- అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు నిర్వహించరాదు.
- ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి.
- జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర.



కామారెడ్డి, అక్టోబరు 31 (తెహెల్కా న్యూస్)

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు నవంబర్ నెలలో 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ 1861ను అమలు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర తెలిపారు. నవంబర్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నెల రోజుల పాటు ఈ ఆదేశాలు జిల్లా వ్యాప్తంగా అమల్లో ఉంటాయని శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ఆదేశాల ప్రకారం పోలీసు శాఖ నుంచి ముందస్తు అనుమతి పొందకుండా ఎవరూ ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. అలాగే బహిరంగ సభలు, సమావేశాలు, ఇతర సామూహిక కార్యక్రమాలు నిర్వహించాలన్నా సంబంధిత పోలీసు అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలి

ప్రజాధనానికి నష్టం కలిగించే విధంగా,శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరూ పాల్పడరాదని ఎస్పీ హెచ్చరించారు. ప్రజా భద్రత, శాంతిభద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు పోలీసు శాఖ నిబంధనలను పాటిస్తూ సహకరించాలని కోరారు. ముందస్తు అనుమతి లేకుండా నిషేధిత కార్యక్రమాలు నిర్వహించినా, ఆదేశాలను ఉల్లంఘించినా సంబంధిత వ్యక్తుల పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. జి ప్రజలు పోలీసు శాఖకు సహకరించి శాంతియుత వాతావరణం కొనసాగించేందుకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.

పిల్లలు దేశ భవిష్యత్తుకు పునాదులు

- ప్రతి చిన్నారికి సురక్షితమైన బాల్యాన్ని అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత.
- పిల్లలు తమకు ఎదురయ్యే గుడ్ టచ్, బ్యాడ్ మధ్య తేడాను తెలుసుకోవాలి.
- అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దు.
- సురక్షితమైన బాల్యం అనేది పిల్లల హక్కు.
- కామారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.నాగరాణి.



కామారెడ్డి, అక్టోబర్ 31 (తెహెల్కా న్యూస్)

పిల్లలు దేశ భవిష్యత్తుకు పునాదులని, వారు శారీరకంగా, మానసికంగా, సామాజికంగా ఆరోగ్యకరమైన వాతావరణంలో ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని సీనియర్ సివిల్ జడ్జి, కామారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.నాగరాణి తెలిపారు. సురక్షిత బచ్ పన్ అభియాన్, పోక్సో చట్టం, పిల్లల కోసం సురక్షిత ఇంటర్నెట్ వినియోగంపై కామారెడ్డి జిల్లా మాచారెడ్డిలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి, కామారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.నాగరాణి హాజరయ్యారు. ప్రతి చిన్నారికి భయరహితమైన, స్వేచ్ఛాయుత మైన, సురక్షితమైన బాల్యాన్ని అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బాలలపై జరిగే లైంగిక వేధింపులు, దోపిడీ, అక్రమ రవాణా, బాల కార్మికత్వం మరియు ఇతర హింసాత్మక చర్యలను అరికట్టేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు మరియు సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలపై లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పోక్సో చట్టంను రూపొందించిందని వివరించారు. ఈ చట్టం ప్రకారం 18 సంవత్సరాలలోపు ఉన్న ప్రతి బాలుడు, బాలికకు లైంగిక వేధింపులు, లైంగిక దాడులు మరియు ఇతర లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించబడుతుందని తెలిపారు.ఈ చట్టం బాలబాలికలిద్దరికీ సమానంగా వర్తిస్తుందని, నేరాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. పిల్లలపై జరిగే లైంగిక నేరాల గురించి తెలిసినప్పుడు వాటిని దాచిపెట్టకుండా సంబంధిత అధికారులకు తెలియజేయడం ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. పిల్లలు తమకు ఎదురయ్యే మంచి స్పర్శ (గుడ్ టచ్),చెడు స్పర్శ (బ్యాడ్ టచ్) మధ్య తేడాను తెలుసుకోవాలన్నారు. తమకు ఇబ్బందికరంగా లేదా అసౌకర్యంగా అనిపించే ప్రవర్తనను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించకూడదని సూచించారు. ఎవరైనా భయపెట్టినా, బెదిరించినా లేదా జరిగిన విషయాన్ని భయ పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన పెద్దలకు వెంటనే తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. పిల్లలు తమపై జరిగిన అన్యాయానికి తాము కారణం కాదని, అలాంటి పరిస్థితుల్లో ఎలాంటి భయం లేదా సంకోచం లేకుండా సహాయం కోరాలని తెలిపారు.

సురక్షిత ఇంటర్నెట్ వినియోగంపై ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలి

ప్రస్తుత డిజిటల్ యుగంలో పిల్లలు ఇంటర్నెట్ మరియు సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగిస్తున్న నేపథ్యంలో సురక్షిత ఇంటర్నెట్ వినియోగంపై ప్రత్యేక అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో అపరిచిత వ్యక్తులతో స్నేహాలు చేయడం, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం, తెలియని లింకులను క్లిక్ చేయడం, అనుమానాస్పద ఫోటోలు లేదా వీడియోలను పంపడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా తమ ఫోటోలు, ఇంటి చిరునామా, పాఠశాల వివరాలు, ఫోన్ నంబర్లు, పాస్‌వర్డ్‌లు మరియు ఇతర వ్యక్తిగత వివరాలను ఆన్‌లైన్‌లో ఎవరితోనూ పంచుకోకూడదని వివరించారు. సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమ్స్, చాటింగ్ యాప్స్ మరియు ఇతర డిజిటల్ వేదికల ద్వారా సైబర్ వేధింపులు, ఆన్‌లైన్ మోసాలు, బ్లాక్‌మెయిలింగ్ వంటి ప్రమాదాలు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇంటర్నెట్ వినియోగంలో అప్రమత్తతతో పాటు బాధ్యతాయుతమైన ప్రవర్తన కూడా అవసరమని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఎవరైనా బెదిరించినా, అసభ్యకరమైన సందేశాలు పంపినా లేదా అనుచితమైన ఫోటోలు, వీడియోలు కోరినా భయపడకుండా తల్లిదండ్రులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని, అవసరమైన ఆధారాలను భద్రపరచాలని సూచించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని సృజనాత్మకతను అభివృద్ధికి ఉపయోగించుకోవాలి

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని తమ విద్యాభివృద్ధికి, విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి మరియు సృజనాత్మకతను అభివృద్ధి చేసుకోవడానికి ఉపయోగించుకోవాలని,అయితే దాని దుర్వి నియోగానికి దూరంగా ఉండాలని హితవు పలికారు. తల్లిదండ్రులు పిల్లలు ఇంటర్నెట్ వినియోగించే విధానాన్ని స్నేహపూర్వకంగా గమనిస్తూ, వారితో స్వేచ్ఛగా మాట్లాడే వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. బాలల హక్కుల గురించి వివరిస్తూ, ప్రతి చిన్నారికి విద్య, ఆరోగ్యం, రక్షణ, గౌరవం మరియు సమాన అవకాశాలు పొందే హక్కు ఉందని తెలిపారు. బాలలపై జరిగే నేరాలను నివారించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలు, మరియు న్యాయ సేవాధికార సంస్థలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

సురక్షితమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ప్రతి విద్యార్థి తన భద్రత పట్ల అవగాహన కలిగి ఉండటంతో పాటు ఇతర పిల్లల భద్రతకు కూడా బాధ్యత వహించాలని, బాలల పై ఎలాంటి వేధింపులు, వివక్ష లేదా హింస చోటు చేసుకోకుండా సురక్షితమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సురక్షితమైన బాల్యం అనేది పిల్లల హక్కు మాత్రమే కాకుండా సమాజం వారిపై నిర్వర్తించాల్సిన బాధ్యత కూడా అని పేర్కొన్నారు. అనంతరం, సురక్షిత బాల్యం, పోక్సో చట్టం మరియు పిల్లల సురక్షిత ఇంటర్నెట్ వినియోగంపై రూపొందించిన అవగాహన పోస్టర్‌ను ముఖ్య అతిథి డాక్టర్ సూర సుమలత గారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయురాలు లిలియాని, చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ కో ఆర్డినేటర్ జి.స్వరూప, కోర్టు సిబ్బంది ఖాజా సమీ ఉల్లాహ్ ఖాన్, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణ కోసం ప్రాణాలను త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయం

- పోలీస్ సేవలు, త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం.
- అదనపు ఎస్పీ నరసింహారెడ్డి
- జిల్లావ్యాప్తంగా ఘనంగా క్యాండిల్ ర్యాలీలు.
- అమరవీరులకు ఘనంగా నివాళులర్పించిన పోలీస్ అధికారులు, ప్రజలు.
- కామారెడ్డి, బాన్సువాడతో పాటు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో కార్యక్రమాలు.





కామారెడ్డి, అక్టోబరు 31 (తెహెల్కా న్యూస్)

దేశ ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ జిల్లావ్యాప్తంగా శనివారం సాయంత్రం క్యాండిల్ ర్యాలీలు నిర్వహించారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. కామారెడ్డి పట్టణంలో అశోక్‌నగర్ చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్ మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. నరసింహారెడ్డి పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు. కామారెడ్డి డీఎస్పీ ఎస్. మధుసూదన్, పట్టణ ఎస్‌హెచ్ఓ బి. నరహరి, పోలీస్ అధికారులు, సిబ్బంది, యువత, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాన్సువాడలో డీఎస్పీ పి. విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో...

బాన్సువాడ పట్టణంలో డీఎస్పీ పి. విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. పట్టణ ఎస్‌హెచ్ఓ టి. శ్రీధర్‌తో పాటు పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ సంబంధిత అధికారులు, ఎస్ఐలు, సిబ్బంది ర్యాలీలు నిర్వహించి అమరవీరుల సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ నరసింహారెడ్డి మాట్లాడుతూ., దేశ ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయమన్నారు. వారి ధైర్య సాహసాలు, నిస్వార్థ సేవలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.